డిండిచింతపల్లి గ్రామస్తులకు ప్రొసీడింగ్‌లను అందజేస్తున్న ఎంపీ రాములు

నిధులను గ్రామాభివృద్ధికి వినియోగించాలి

- డిండిచింతపల్లికి రూ.7లక్షల ప్రొసీండిగ్‌లను అందజేసిన ఎంపీ రాములు

వంగూరు, ఫిబ్రవరి 21 : గ్రామంలో అభివృద్ధి పనులకు మంజూరు చేసిన నిధులను సద్వినియోగం చేసుకుని గ్రామాభివృద్ధికి తోడ్పాడాలని ఎంపీ రాములు గ్రామస్తులకు సూచించారు. మండలంలోని డిండిచింతపల్లిలో నిర్మిస్తున్న రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి రూ.5లక్షలు, గ్రామంలో శివాలయం దగ్గర హైమాస్టు లైట్లను ఏర్పాటు కోసం మరో రూ.2లక్షలను మంజూరు చేయడంతో పాటు వాటి ప్రొసీడింగ్‌లను బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎంపీ గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, బీఆర్ఎస్ నేతలు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సాయిలు, బీఆర్ఎస్ నేతలు మల్లేశ్, సాయిలు, సిద్ధయ్య, నయీం, రాంచంద్రయ్య, బాలయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

తాడూరు, ఫిబ్రవరి 21 : మండలంలోని యాదిరెడ్డిపల్లి చెన్నకేశవ స్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో బుధవారం ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఎమ్మెల్యేకు ఆలయ సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు ధ్వజస్తంభ ప్రతిష్ఠ బలిహరణ, కుంభం, కలశ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రోహిణి, కౌన్సిలర్ శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు

మోడల్ కళాశాలలో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

వెల్దండ, ఫిబ్రవరి 21 : మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సర విద్యార్థినీ, విద్యార్థులు చక్కటి వేషధారణలో చేసిన నృత్యాలు చూపరులను కనువిందు చేశాయి. పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు పట్టుదలతో చదివి తల్లిదండ్రులకు, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని గురువులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంజీవ్‌రెడ్డి, మోడల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాధాక్రిష్ణ , అధ్యాపకులు శివప్రసాద్, షన్ముఖరెడ్డి, ప్రవీణ, సుమలత, రాఘవేందర్, నర్సింహ, రవీందర్, చంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, రేణుకా, రమా, విష్ణుప్రియా, చంద్రకళ, అనురాధ, స్వాతి, రవీందర్ విద్యార్థులు ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు రానీయొద్దు

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 21 : రైతులు మార్కెట్‌కు నాణ్యమైన విత్తనాలను తీసుకురువాలని, మార్కెట్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ ఉపసంచాలకులు సింగారెడ్డి అన్నారు. బుధవారం ఆయన నాగర్‌కర్నూల్ వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించి మార్కెట్‌లో చేపడుతున్న కొనుగోళ్లను పరిశీలించారు. రైతులకు అందిస్తున్న మద్దతు ధర గురించి తెలుసుకున్నారు. రైతులు, కమీషన్ ఏజెంట్లకు, ఖరీదుదారులతో సమావేశం ఏర్పాటు చేసి వేరుశనగపై చర్చించారు. రైతులు మట్టి, తాలు లేకుండా మార్కట్‌కు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెటింగ్‌శాఖ ఉప సంచాలకులు వైజే పద్మహర్ష, డివిజినల్ వ్యవసాయశాఖ అధికారి రమేశ్‌బాబు, మార్కెటింగ్ అధికారి బాలమణి తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాము, పూరి గుడిసె దగ్ధం

లింగాల, ఫిబ్రవరి 21: మండలంలోని పద్మన్నపల్లి గ్రామంలో రెండు గడ్డివాములు, పూరి గుడిసె దగ్ధమై దాదాపు రూ.50వేల ఆస్తినష్టం వాటిల్లిన ఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకున్నది. గ్రామస్తులు తెలిపిన కథనం ప్రకారం పద్మన్నపల్లికి చెందిన వర్కాల బుచ్చయ్య అనే రైతు గ్రామంలో ఉన్న పశువుల కొట్టంలో వరిగడ్డితోపాటు బుడ్డపొట్టు వాము వేసి ఉంచారు. కాగా పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మిరుగులు పడి ఒక్కసారిగా మంటలు చేలరేగినట్లు తెలిపారు. అదే విధంగా పక్కనే ఉన్న జాజాల నారాయణకు సంబంధించి పూరి గుడిసె కాలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. మంటలు చెల రేగడంతో భయభ్రాంతులకు గురైన చుట్టు పక్కల ప్రజలు అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మం టలను అదుపులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు.

అంతర్జాతీయ భాషా దినోత్సవం

కొల్లాపూర్, ఫిబ్రవరి 21 : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లు రామరాజుయాదవ్, మార్క్ పోలోనియస్, తెలుగు విభాగం అధిపతి జగన్నాథం మాట్లాడుతూ ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృ భాషను మరిచిపోరాదన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

అమ్రాబాద్, ఫిబ్రవరి 21 : మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని డీపీఎం శ్రీనివాసులు అన్నారు. బుధవారం మహిళా సమాఖ్య కార్యాలయంలో వీవోఏలకు లక్పతీదీదీ పథకంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ మహిళలు జీవనోపాది ప్రమాణాలను మెరుగుపర్చుకునేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు సంతోష్, రాంరెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★హైదరాబాద్‌లో అర్జెంటుగా కొండాపూర్‌కి సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచి జీతం, భోజనం, వసతి కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.

NT-313897-All

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

శ్రీశైలంలో ముగిసిన మహా కుంభాభిషేకం

- శివాజీ గోపురంపై సువర్ణ పంచకలశ స్థాపన
- ప్రధానాలయ విమానాలతోపాటు 95 ఉపాలయాలు
- శాస్త్రోక్త పూజలు నిర్వహించిన కంచి పీఠాధిపతులు

శ్రీశైలం ఫిబ్రవరి 21 : శ్రీశైల మహాక్షేత్రంలో మహా కుంభాభిషేక మహోత్సవాలు ఆరు రోజులపాటు ఘనంగా జరిగాయని ఆంధ్రప్రదేశ్ దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఉభయఆలయాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యాగశాలలో గణపతి, రుద్ర, చండీ హోమాలు, పారాయణలు ముగించుకొని మహాపూర్ణాహుతిని సమర్పించారు. శివాజీ గోపురంపై సువర్ణ పంచ కళశస్థాపన చేసేందుకు షోడశోపచార పూజా క్రతువులు జరిపించి జగద్గురు పీఠాధిపతి చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామితో పాటు కాశీ పీఠాధిపతి మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య మహాస్వామి ఆధ్వర్యంలో మంత్రి దంపతులు, స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, ఆలయ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి కలశ స్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా స్వామివారి గర్భాలయ కలశానికి కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతీ మహాస్వామి వారి శిష్య బృందంచే ఆలయ వేదపండితులు గంటి రాధాకృష్ణశర్మ పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించగా, అమ్మవారి గర్భాలయ ప్రధాన గోపురానికి పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి మహాస్వామిచే ప్రత్యేక పూజలు, శుద్ధజలాలతో లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ మహాకుంభాభిషేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా శివాజీ గోపురంపై కలశస్థాపన, ఆలయ ప్రాకారంలోని పలు ఉపాలయాల పునరుద్ధరణ, పంచ మఠాల పునరుద్ధరణ, పలు ఉపాలయాల్లో శివలింగాలు, నందీశ్వరులను ప్రతిష్ఠింపజేసినందుకు మహా కుంభాభిషేకాన్ని నిర్వహించినట్లు దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. అదేవిధంగా మహా కుంభాభిషేక పూజా కార్యక్రమాలను స్మార్త, శైవాగమ పద్ధతుల ప్రకారం శాస్త్రోక్తంగా జరిపించినట్లు ఆలయ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో పెద్దిరాజు పేర్కొన్నారు. ప్రధానాలయాలతోపాటు క్షేత్ర పరిధిలోని సుమారు 95 ఉపాలయాలకు ఒకే ముహూర్తంలో కుంభాభిషేకాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల్‌వల్వన్, ఎంపీ పోచబ్రహ్మానందరెడ్డి, విజయవాడ ఈవో కేఎస్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు మహా కుంభాభిషేకం చేస్తున్న కంచి పీఠాధిపతి

పాల్గొన్న భక్తులు

ఇరువర్గాల మధ్య ఘర్షణ

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 21 : మండల కేంద్రంలో ఇటీవల నిర్వహించిన ఒక వర్గానికి చెందిన జయంతి సందర్భంగా నిర్వహించిన ఊరేగింపుపై మరో మూడు వర్గాలకు చెందిన యువకుల మధ్య బుధవారం చోటుచేసుకున్నది. ఈ మేరకు ఇరు వర్గాల వారు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి కేసు నమోదు చేస్తామని ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపారు.

మహిళకు రెండేళ్ల జైలుశిక్ష

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 21 : మున్సిపాలిటీ పరిధిలోని ఎండబెట్లకు చెందిన మంగలి లక్ష్మమ్మకు నాగర్‌కర్నూల్ మెజిస్ట్రేట్ మానిక రెండేళ్ల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధించినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు. క్రైమ్ నెంబర్ 327/2016 U/S 454, 380, 411 IPC కేసులో ఇన్విస్టిగేషన్ అనంతరం దొంగతనం చేసినట్లు రుజువు కావడంతో శిక్షతోపాటు జరిమానా విధించినట్లు తెలిపారు.

గడ్డివామును తగులబెట్టిన దుండగులు

కొల్లాపూర్, ఫిబ్రవరి 21 : మండలంలోని జావాయిపల్లిలో రైతు కుమ్మరి గోపాల్ పశుగ్రాసాన్ని నిల్వ చేసుకున్నాడు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండుగులు పశుగ్రాసాన్ని తగులబెట్టారు. మంటలు చెలరేగడంతో గ్రామస్తులు అగ్నిమాపక కేంద్రం సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా గడ్డి కాలిపోయింఇ. రూ.30వేలు నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. ఈ మేరకు గోపాల్ బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆయిల్‌పాం తోటల సందర్శన

తాడూరు, ఫిబ్రవరి 21 : మండలంలోని మేడిపూర్‌లో వెంకట్‌రెడ్డి ఆయిల్‌పాం తోటను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌పాం రీసెర్చ్ డైరెక్టర్ (ఐఐవోపీఆర్) సురేశ్ బుధవారం సందర్శించారు. తోటను సందర్శించి రైతులకు సూచనలను, సలహాలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త రామచంద్రుడు, ఉద్యానవన శాఖ జేడీ సరోజినిదేవి, ఏడీ లహరి, ఆయిల్‌పాం కంపెనీ డీజీఎం రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

డబుల్ ఓటర్లకు నోటీసు ఇచ్చి తొలగించాలి

- కలెక్టర్ ఉదయ్‌కుమార్

అచ్చంపేట, ఫిబ్రవరి 21: ఓటర్ల జాబితాలో రెండుచోట్ల ఓట్లు ఉన్నవారిని గుర్తించి నోటీసు అందించి తొలగించాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. బుధవారం సాయంత్రం అచ్చంపేట ఆర్డీవో కార్యాలయంలోని యోజకవర్గంలోని తాసీల్దార్లు, జూనియర్ అ కౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒక వ్యక్తికి ఒకటి కన్నా రెండుచోట్ల ఓటు కలిగిఉంటే జాబి తా నుంచి తొలగించాలని ఆదేశించారు. ఒక వ్యక్తికి ఒకే చోట ఓటు హక్కు కలిగి ఉండాలన్నా రు. జాబితాను సవరించి పో లింగ్ బూత్‌లో ఎంఎఫ్ ఫెసిలిటిస్ అన్ని సక్రమంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తాసీల్దార్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

కొల్లాపూర్‌ను విద్యాహబ్‌గా తీర్చిదిద్దుతాం

కొల్లాపూర్, ఫిబ్రవరి 21 : విద్య, ఉపాధి అవకాశాలకు హబ్‌గా కొల్లాపూర్‌ను తీర్చిదిద్దేలా (కొల్లాపూర్ ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్) కోసా పనిచేస్తుందని ప్రధాన కార్యదర్శి శశికాంత్ వాల్మీకి వెల్లడించారు. పట్టణంలో బుధవారం పలు ప్రభుత్వ పాఠశాలల్లో, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సాంకేతిక విద్యపై అవగాహన కల్పించారు. ఏప్రిల్ 3న కొల్లాపూర్‌లో మెరిట్ పరీక్ష ఉంటుందని, ఇందులో ఉత్తీర్ణులైన విద్యార్థులకు హైదరాబాద్‌లో ప్రముఖ కోచింగ్ సెంటర్ సహకారంతో పాలిసెట్ కోచింగ్‌తోపాటు హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు.

వైభవంగా శేష వాహనసేవ

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 21 : మండలంలోని దేవునితిర్మలాపూర్ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శేష వాహనసేవ నిర్వహించారు. ఆలయ ప్రాంగణం గోవిందనామస్మరణతో మారుమోగింది. అనంతరం వెంకటేశ్వరస్వామిని ఊరేగించారు. కార్యక్రమంలోల మాజీ సర్పంచ్ సత్యం, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాసులు, పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఊరేగింపు

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 21 : జిల్లా కేంద్రంలో శివభక్తుల ఆధ్వర్యంలో బుధవారం వీరభద్ర స్వామి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ శివాలయంలో స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో గురుస్వామి విజయ్‌కుమార్ భక్తులు ఉన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ ..

అమ్రాబాద్, ఫిబ్రవరి 21 : మండలంలోని మన్ననూర్ గ్రామ గిరిజన ఆశ్రమ పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయం పరిపాలనా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. కార్యక్రమంలో హెచ్ఎం తిరుపతమ్మ పాల్గొన్నారు.



మన్ననూర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో స్వయంపాలనలో పాల్గొన్న విద్యార్థులు

జర్నలిస్టు సంఘం ఎన్నిక

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 21 : నాగర్‌కర్నూల్ నూతన జర్నలిస్టు సంఘాన్ని (రి.నెం: 47/2024) బుధవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా విజయ్‌కుమార్, అధ్యక్షుడిగా వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శిగా మోహన్, ఉపాధ్యక్షుడిగా దినకర్‌రావు, సహాయ కార్యదర్శిగా విజయ్, కోశాధికారిగా హనీస్, సభ్యులుగా శ్యాంసుందర్, రాంబాబు, రమేశ్‌లను ఎన్నుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆర్థికసాయం అందజేత

ఊర్కొండ, ఫిబ్రవరి 21 : రాచాలపల్లికి చెందిన హుస్సెన్‌కు ఇటీవల ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో ఎస్‌వీఎస్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయాన్ని ఎంపీటీసీ, లావణ్య, అమరేశ్వర్‌రెడ్డి ద్వారా తెలుసుకున్న జిల్లా కరాటే, కబడ్డీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డికి తెలుపగా బాధిత కుటుంబానికి వైద్యఖర్చుల నిమిత్తం రూ.5వేలు పంపించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ పరుశరాములు, పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

తాడూరు, ఫిబ్రవరి 21 : మండలంలోని బలాన్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని 6,9వ తరగతి విద్యార్థులకు అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం గోవిందారెడ్డి, మల్లేశ్‌కుమార్, వ్యవస్థాపకుడు రాఘవేందర్ పాల్గొన్నారు.

భూములు గుంజుకుంటే ఆత్మహత్యలే శరణ్యం

- అవసరమైతే సీఎం వద్దకు వెళ్తాం..
- తర్నికల్ గ్రామ రైతుల ఆందోళన
- తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

కల్వకుర్తి, ఫిబ్రవరి 21 : జాగీర్దార్ భూములపై కాస్తుదారులు, అనుభవదారులుగా ఉన్న తమకు అన్యాయం చేయొద్దని, 70 ఏండ్ల నుంచి ఈ భూములను నమ్ముకొని బతుకుతున్నాయని, ఇప్పుడు కొందరు జాగీర్దార్ సంబంధికులతో కలిసి భూములు కొల్లగొడుతున్నారని, అదే జరిగితే తమకు ఆత్మహత్యలే శరణ్యమని తర్నికల్ గ్రామానికి చెందిన 70 మంది రైతులు ఆందోళన చెందారు. బుధవారం కల్వకుర్తి తాసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి అనంతరం తాసీల్దార్ ఇబ్రహీంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం గ్రామంలో జాగీర్దార్లు దాదాపు 280కుపైగా ఎకరాల భూమిని రైతులకు ఇచ్చారని వారు తెలిపారు. నాటి నుంచి భూముల్లో పంటలు సాగు చేస్తున్నామని వివరించారు. వంశపారంపర్యంగా సదరు భూముల్లో కబ్జాదారులు ఉన్నారని, ఈ భూములపై గతంలో తాసీల్దార్ పంచనామా నిర్వహించి ఖాస్తుదారులుగా సర్టిఫికెట్లు అందజేశారని వారు తెలిపారు. అయితే భూములకు సంబంధించిన జాగీర్దార్లు సంబంధికులతో కలిసి కొందరు అక్రమార్కులు భూ రికార్డులను తారుమారు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది వరకు ఈ భూములకు సంబంధించిన డిజిటల్ సిగ్నేచర్ పెండింగ్‌లో ఉన్నదని, ఈ జనవరిలో అప్రూవల్ అయ్యిందని రైతులు వాపోయారు. జాగీర్దార్ భూములకు సంబంధించి 11 ఎకరాలు విక్రయం కూడా జరిగిందని వినతిలో రైతులు పేర్కొన్నారు. ఈ భూములకు సంబంధించి ఎలాంటి రికార్డులు మార్పులు చేయొద్దని, యథాతథ స్థితిని కొనసాగించాలని కోరారు. రైతులకు జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి మద్దతు పలికారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే భూఆక్రమణ దారులు రంగప్రవేశం చేశారని మండిపడ్డారు. పేదలు ఆధారపడి బతుకుతున్న భూములను గుంజుకుంటారా? అని నిలదీశారు. ఈ భూములను వదులుకొనే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఈ భూములను గొల్లగొట్టడంతో ప్రభుత్వంలో పెద్ద స్థాయి వ్యక్తులు చక్రం తిప్పుతున్నారని ఆరోపించారు. రైతులందరితో కలిసి ట్రాక్టర్లలో సీఎం రేవంత్‌రెడ్డి ఇంటికి వెళ్లి న్యాయం కోరుతామని చెప్పారు.

మాకేం సంబంధం లేదు..

జాగీర్దార్ భూములకు సంబంధించి తాము ఎలాంటి నివేదిక తయారు చేయలేదని, పై స్థాయిలో సీసీఎల్ లేదా ఇంకా ఎక్కడైనా సదరు భూములకు సంబంధించిన రికార్డులకు డిజిటల్ సిగ్నేచర్ అయిందని. అప్పుడే స్లాట్ బుక్ అవుతుందని చెప్పారు. ఈ భూముల రిజిస్ట్రేషన్ నిలిపే అధికారం తమకు లేదన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని రైతులకు తాసీల్దార్ హామీ ఇచ్చారు.

తాసిల్దార్ ఇబ్రహీంకు వినతిపత్రం ఇస్తున్న తర్నికల్ గ్రామ జాగీర్దార్ భూముల రైతులు

చెంచులకోసం ఐటీడీఏ గ్రీవెన్స్ డే

అమ్రాబాద్, ఫిబ్రవరి 21 : నల్లమలలో చెంచుల సమస్యల పరిష్కారానికి ప్రతి బుధవారం మన్ననూర్ ఐటీడీఏ కార్యాలయంలో గ్రీవెన్స్‌డేను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని ఇన్‌చార్జి పీవో జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్‌గోపిడి తెలిపారు. బుధవారం అధికారులతో చెంచులకోసం అభివృద్ధి, సంక్షేమ పథకాలు, సీఎం జన్మన్ పథకం అమలు కోసం ఆయన సమీక్ష నిర్వహించారు. గురువారం మొదటగా మన్ననూర్ గ్రామ చెంచులలో ఎస్టీ వసతి గృహంలో అన్ని శాఖల అధికారులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికపై ఇద్దరి యువకుల లైంగికదాడి

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 21 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి సమీపంలోని ఉన్న ఓ గ్రామంలో 13 ఏండ్ల బాలికపై ఇద్దరు యువకులు లైంగికదాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్సై గోవర్ధన్ కథనం మేరకు.. సదరు బాలిక పొయ్యిల కట్టెలకోసం సోమవారం సాయంత్రం పంట పొలానికి వెళ్లింది. కాగా, అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు బాలికను వెంబడించి లైంగికదాడికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని బాలిక కుటుంబసభ్యులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా సైన్స్ టాలెంట్ టెస్ట్

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 21 : జిల్లాలోని 20 మండల కేంద్రాల్లో బుధవారం మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి తెలకపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌పేపర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతికత, ప్రయోగ నైపుణ్యాలు, ఆలోచనలా శక్తికి ఇటువంటి టాలెంట్ టెస్ట్‌లు ఉపయోగపడుతాయన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఈ నెల 23న జిల్లాకేంద్రంలో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించే జిల్లాస్థాయి ఓటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో పాల్గొంటారన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 21 : వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేకాధికారులకు సూచించారు. బుధవారం ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేకాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మార్చి నుంచి జూలై వరకు నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు మిషన్‌భగీరథ నీటికి ప్రత్యామ్నాయంగా మంచినీటి వనరులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో లక్ష్మీదేవి, ఎంపీవో బ్రహ్మచారి పాల్గొన్నారు.

నేడు సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం

కల్వకుర్తి రూరల్, ఫిబ్రవరి 21 : మండలంలోని రఘుపతిపేట గ్రామఅనుబంధ గ్రామమైన రామగిరి సీతారామచంద్రస్వామి ఆలయంలో నేడు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తునట్లు ఆలయ కమిటీ చైర్మన్ భీమయ్య తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో దేవతామూర్తులకు, మైసమ్మ అమ్మవారికి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. గురువారం ఉత్సవ మూర్తులకు మంగళస్నానం నిర్వహించి శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

తాగునీటికి ఇబ్బంది కలగొద్దు

కల్వకుర్తి రూరల్, ఫిబ్రవరి 21 : రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా తగిన విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీవో దేవేందర్ సూచించారు. గురువారం మండలంలోని తర్నికల్, తుర్కలపల్లి, పంజుగుల గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేలా ప్రణాళికలు వేయాలన్నారు. గ్రామాల్లో పన్నుల సేకరణ వందశాతం పూర్తిగా చేయాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీలో రికార్డులను పరిశీలించి గ్రామంలో ఈజీఎస్ పనులపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కార్యదర్శులు ఉన్నారు.

విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలి

అమ్రాబాద్, ఫి